సంపూర్ణ అభియాన్ ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (నమస్తే తెలంగాణ):నీతి అయోగ్ ఆస్పిరేషనల్ జిల్లా, ఆస్పిరేషనల్ మండలం ఆకాంక్షిత కార్యక్రమంలో భాగంగా గురువారం ఐడీవోసీ కార్యాలయంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష వి పాటిల్ ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ముందుగా సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీవో శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజేత, వైద్యాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఈవో వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.

క్వార్టర్ల నిర్మాణ పనుల పరిశీలన

రామవరం, జూలై 4: సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ప్రతిపాదిత వీకేవోసీ విస్తరణలో భాగంగా రుద్రంపూర్‌లోని ఎస్‌ఆర్‌టీ, వనమా నగర్, మాయాబజార్‌లో ఇండ్లను కోల్పోయే వారికి కొత్తగూడెంలో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. కొత్తగూడెంలో సీహెచ్‌పీ, ఉద్యోగుల క్వార్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటిని డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఏరియా జీఎం శాలెంరాజు, జీఎం (సివిల్) సూర్యానారాయణ, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, వీకేవోసీ పీవో శ్రీరమేష్, డీజీఎంలు సూర్యానారాయణ, సదానందం పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా సందర్శన

రామవరం, జూలై 4: సింగరేణి కొత్తగూడెం ఏరియాను జీఎం సీహెచ్‌పీ (కార్పొరేట్) తిరుమలరావు సందర్శించారు. ఆయనను ఏరియా జీఎం శాలెంరాజు స్వాగతించి, శాలువా కప్పి సత్కరించారు. ఏరియాలోని సీహెచ్‌పీల పనితీరును ఇంజినీర్ దుర్గాప్రసాద్ వివరించారు. ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం దుర్గాప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీరమేష్, డీజీఎం సదానందం, ఎస్ఈ మాధవ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడికి ఆర్థిక సాయం

కొత్తగూడెం సింగరేణి, జూలై 4: సింగరేణి కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్ట్ కార్మికుడు మాలోత్ శంకర్.. నెల క్రితం తన ఇంటి వద్ద జారిపడటంతో రెండు కాళ్లు విరిగాయి. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆయనకు సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, పర్మినెంట్ ఉద్యోగులు అండగా నిలిచారు. వారు గురువారం రూ.23,400ను డీజీఎం (సివిల్) రాజశేఖర్ ద్వారా శంకర్ సతీమణికి అందజేశారు.

ఐటీ ఫారం-16 చిట్టీలు అందజేత

ఇల్లెందు రూరల్, జూలై 4: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగులకు ఐటీ రిటర్న్స్ ఫారం-16 చిట్టీలను జీఎం జాన్ ఆనంద్ గురువారం తన కార్యాలయంలో అందజేశారు. అధికారులు జీవీ మోహన్‌రావు, మధుబాబు, సాయి స్వరూప్, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్‌గా నాగెల్లి

మణుగూరు టౌన్, జూలై 4: టీబీజీకేఎస్ మణుగూరు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంటుగా నాగెల్లి వెంకట్‌ను నాయకత్వం నియమించింది. ఆయన ఇప్పటివరకూ టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

విద్యుత్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్

పాల్వంచ, జూలై 4: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చారుగుండ్ల రమేశ్ ఎన్నికయ్యారు. ఆయన కేటీపీఎస్ ఏడో దశలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో రమేష్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్ నియమితులయ్యారు.

పీహెచ్‌సీ తనిఖీ

దుమ్ముగూడెం, జూలై 4: స్థానిక పీహెచ్‌సీని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ అమర్‌సింగ్ గురువారం తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. కాన్పుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ స్పందన, డాక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్లలో..

చర్ల, జూలై 4: చర్ల (కొయ్యూరు) పీహెచ్‌సీని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ అమర్‌సింగ్ గురువారం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్పందన, డీఎస్‌వో డాక్టర్ రాజేష్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, హెచ్ఈవో వేణుగోపాల్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తే తెలంగాణ ఉద్యమానికి నాంది: ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తే నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నాంది పలికిందని, తద్వారా తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి బీసీ హక్కుల సాధాణ సమితి ఆధ్వర్యంలో గురువారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్ రాజ్‌గౌర్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూనంనేని మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉందని, అయితే ఇది రాజకీయ అవగాహన మాత్రమే అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వంతో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758

CHANGE OF NAME
★I, TALARI HEPSIBA RANI, R/o. H.No. 5-2-10/3/1-2, SP Office Road, Park Line, Shanthi Nagar, Khammam-507 001. Changed My Name as HEPSIBA RANI KEDASI, W/o. Talari Sumakar.
NT-327677

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'రైతు బంధు'ను కొనసాగించాలి

ప్రభుత్వాన్ని కోరిన రైతులు

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్‌బేగం

అశ్వారావుపేట, జూలై 4: రైతు భరోసా పథకంపై వ్యవసాయ అధికారులు గురువారం రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. స్థానిక రైతు వేదిక భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతు కలపాల భద్రం మాట్లాడుతూ.. ''కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకాన్నే కొనసాగించాలి'' అని కోరారు. సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా మంజూరు చేయాలని, 10 ఎకరాల్లోపు భూమికి కచ్చితంగా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని రైతులు కోరారు. ఐటీ రిటర్న్స్ నిబంధనను తొలగించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తే రైతు భరోసా వంటి పథకాల అవసరం ఉండదని మరికొందరు రైతులు అభిప్రాయాలు వెలిబుచ్చారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడు నెలలు అవుతున్నా కూడా ఇప్పటి వరకు 'రైతు భరోసా'ను ఎందుకు అమలు చేయలేదు?'' అని ఇంకొందరు నిలదీశారు. వ్యవసాయ సీజన్ అదును దాటిపోతున్నా కూడా పంట సాయం అందకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసాను బేషరతుగా అమలు చేయాలని కోరుతూ ఏడీఏ అఫ్జల్ బేగానికి తెలంగాణ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య వినతిపత్రం ఇచ్చారు. అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఏడీఏ అఫ్జల్ బేగం, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మానిటరింగ్ ఆఫీసర్ సోమయ్య, ఏవో వై.నవీన్, సీఈవో మానేపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీవో మహాలక్ష్మి, ఆళ్లపల్లి: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్

అన్నపురెడ్డిపల్లి, జూలై 4: మండలంలోని గిరిజన ప్రాథమిక పాఠశాల(జీపీఎస్)లను అధికారులు ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో మహాలక్ష్మి కోరారు. వారితో ఆమె గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆరు గిరిజన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి/మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లిలో..

ఆళ్లపల్లి, జూలై 4: మండలంలోని 14 గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను అధకారులు త్వరగా పూర్తి చేయించాలని ఎంపీవో/ఇన్‌చార్జ్ ఎంపీడీవో బత్తుల శ్రీనివాస్ కోరారు. వారితో ఆయన గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏపీఎం రామ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్‌లో..

పాల్వంచ రూరల్, జూలై 4: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. ఈ పనులపై గురువారం సమీక్షించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీరామ్మూర్తి, అధికారులు శ్రీకాంత్, రాంబాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పర్యటన



రామచంద్రయ్యకు నివాళులర్పిస్తున్న రేగా

మణుగూరు టౌన్, జూలై 4: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం మణుగూరు పట్టణంలో, మండలంలో పర్యటించారు. పెట్రోల్ బంక్ వద్ద అల్లూరు సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాయికూనవరంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్ర య్య దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

భద్రాచలం, జూలై 4: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం భద్రాచలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అందజేశారు. కార్యక్రమంలో డీటీ మణిధర్, ఆర్ఐ నర్సింహారావు, నాయకులు రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, పెద్దినేని శ్రీనివాస్, నర్రా రాము, మామిడి పుల్లారావు, భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, చింతాడి రామకృష్ణ, గోపి, గాడి విజయ్ పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నులు అందజేత

చర్ల, జూలై 4: మండలంలోని పూజారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివంగత పెద్దాడ సత్యనారాయణ జ్ఞాపకార్థం భార్య సుశీల, కుమార్తె రాధ విద్యార్థులకు గురువారం పెన్నులు, పుస్తకాలు, ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పీవీ రమణ, హెచ్ఎం చిట్టిబోతుల వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు రాజేశ్వరి, రామారావు, చంద్రయ్య పాల్గొన్నారు.

దళిత నాయకుల నిరసన

అన్నపురెడ్డిపల్లి, జూలై 4: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షంచాలన్న డిమాండుతో దళిత సంఘం నాయకులు గురువారం స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఎస్సైని వేధించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. చల్లా రాంబాబు, చెన్నారావు, కళాధర్, లక్ష్మణరావు, రమేష్, పుల్లయ్య, వెంకన్న, రాజు, నాగు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఐటీడీఏ పీవో బీ రాహుల్



పాయం కుమారిని అభినందిస్తున్న ఐటీడీఏ పీవో బీ రాహుల్

భద్రాచలం, జూలై 4: గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు వివిధ క్రీడల్లో రాణించాలని, నైపుణ్యంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం అభినందనీయమని భద్రాచలం ఐటీడీఏ పీవో బీ రాహుల్ అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో జాతీయ స్థాయిలో రన్నింగ్ విభాగంలో అనేక బంగారు పతకాలు సాధించి, రాబోయే అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీల కోసం ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్‌లో రన్నింగ్ విభాగంలో శిక్షణ కోసం వెళ్తు పాయం కుమారిని పీవో అభినందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ లో 200మీటర్ల రన్నింగ్ రేస్ కోసం కోచ్ భగత్ నేతృత్వంలో శిక్షణ తీసుకుంటుందని తెలిపారు. ఈ బాలికను స్ఫూర్తిగా తీసుకొని తోటి బాలికలు కూడా వారికి నచ్చిన ఆటల్లో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు సన్నద్ధం కావాలని పీవో ఆకాంక్షించారు. ఐటీడీఏ తరపున కుమారికి సహాయ, సహకారాలు అందించడానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ఓం శక్తి మహిళా సంఘం అధ్యక్షురాలు సుధారాణి, కుమారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతు అభ్యంతరంతో ఆగిన డ్రైనేజీ

తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట కన్నీటిపర్యంతమైన రైతు నాగేశ్వరరావు

చంద్రుగొండ, జూలై 4: తన పొలంలోకి మురుగు నీరు చేరేలా డ్రైనేజీ నిర్మిస్తున్నారంటూ ఓ రైతు అభ్యంతరం చెప్పడంతో అధికారులు ఆ నిర్మాణ పనులను ఆపేశారు. మండలంలోని గుర్రంగూడెం పంచాయతీలో డ్రైనేజీ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.3లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఈ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే అందులోని నీరంతా తన పొలంలోకి వస్తుందని, పంట దెబ్బతింటుందని రైతు గోదా నాగేశ్వరరావు పలుమార్లు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు అభ్యంతరం తెలిపారు. అయినప్పటికీ మూడు రోజులుగా డ్రైనేజి నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో ఆ రైతు గురువారం తహసీల్దార్ సంధ్యారాణి , ఎంపీడీవో అశోక్‌ను గురువారం కలిసి విషయం వివరించారు. తన పొలాన్ని కాపాడాలంటూ వారి ఎదుట భోరున ఏడ్చాడు. పట్టాదారుడనైన తనకు తెలియకుండా, అనుమతి లేకుండా డ్రైనేజీ ఎలా నిర్మిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ''మా సమీప బంధువు మేడా మోహన్‌రావు బీఆర్ఎస్ పార్టీ నాయకుడిగా ఉన్నారు. ఆయనపై కక్షతోనే, అధికార పార్టీ నాయకుల ఒత్తడితోనే ఇలా నా పొలంలోకి మురుగు నీరు వెళ్లేలా డ్రైనేజీ నిర్మిస్తున్నారు'' అని ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్ సానుకూలంగా స్పందించారు. పనులను ఆపేయాలని పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాసరావును ఆదేశించారు.

'వంగవీటి'కి నివాళి

అశ్వారావుపేట, జూలై 4: రాజకీయాలకతీతంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి మోహన రంగా ఎనలేని సేవలు అందించారని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మున్నూరుకాపు సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యూఎస్ ప్రకాశ్‌రావు, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, నాయకులు తాడేపల్లి రవి, మద్దాల నాగేశ్వరరావు అన్నారు. వంగవీటి మోహన రంగా 77వ జయంతి వేడుకను గురువారం స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపు జాతి రాజకీయ ఎదుగుదలలో రంగా కీలక పాత్ర పోషించారని అన్నారు. నాయకులు సంగీతం బుల్లియ్య, కొట్టే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జలగంను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం, జూలై 4: మాజీ మంత్రి జలగం ప్రసాదరావు గురువారం భద్రాచలం వచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. జలగంను కలిసిన వారిలో నాయకులు ఆకోజు సునీల్ కుమార్, రావులపల్లి పృథ్వీ, విశ్వనాథ్, ఐనాల రామకృష్ణ, డానియేల్, ప్రదీప్, దన్నాన తరుణ్, చిట్టిమల్ల అనీల్, వింజం నాగసాయి, నాగేశ్వరరావు, సాయి తదితరులు ఉన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, జూలై 4: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం రాములోరికి అర్చకులు నిత్య కల్యాణం జరిపారు. తెల్లవారుజామున స్వామికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, నిత్య పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం జరిపారు.

బాలలతో పనులు చేయిస్తే కేసులు

ఇల్లెందు, జూలై 4: బాలలతో పనులు చేయించిన వారి పై కేసులు నమోదు చేస్తామని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. ఆయన గురువారం డీఎస్పీ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడారు. జూలై 1న ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమైందన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, పీసీ, చైల్డ్ వెల్ఫేర్ నుంచి మహిళా అధికారి పాల్గొంటారని చెప్పారు. వీరంతా ఇల్లెందువ్యాప్తంగా తిరుగుతారని చెప్పారు. 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తారని చెప్పారు. ఆ పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించి,. బడిలో చేర్పించేలా చూస్తారని అన్నారు.

మణుగూరులో కార్డన్ సెర్చ్

మణుగూరు టౌన్, జూలై 4: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంటలో గురువారం ఉదయం డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పోలీసులు కారర్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని 20 మోటర్ సైకిళ్లు, నాలుగు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనపర్చుకుని స్టేషన్‌కు తరలించారు. గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడు తూ... సైబర్ నేరాలపట్ల అవగాహనతో ఉండాలన్నారు. అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

గుండాల, జూలై 4: మత్తు పదార్థాలతో జరిగే నష్టాలపై స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల/పాఠశాల విద్యార్థులకు సీఐ రవీందర్ గురువారం అవగాహన కల్పించారు. గంజాయి, ఇతరత్రా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లుగా, వాడుతున్నట్లుగా తెలిస్తే ప్రిన్సిపాల్‌కు, పోలీసులకు తెలపాలని కోరారు. ప్రిన్సిపాల్ హరికృష్ణ పాల్గొన్నారు.

రోశయ్య జయంతి వేడుకలు



భద్రాచలం: రోశయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న చారుగుళ్ల శ్రీనివాస్

అశ్వారావుపేట టౌన్/జూలూరుపాడు /లక్ష్మీదేవిపల్లి/అన్నపురెడ్డిపల్లి/ఇల్లెందు రూరల్/భద్రాచలం, జూలై 4: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశ య్య జయంతి వేడుకను ఆర్య వైశ్య సం ఘం నాయకులు గురువారం నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశ్వారావుపేటలో జల్లిపల్లి శ్రీరామ్మూర్తి (ఎంపీపీ), శీమకుర్తి శ్రీనివాసరావు, కొణిజర్ల ఉమామహేశ్వరరావు, తాతా శ్రీనివాసరావు, జల్లిపల్లి లోక్‌నాథ్ గుప్తా, గుడివాడ కృష్ణమూర్తి, జూలూరుపాడులో ఉడతా వెంకటేశ్వర్లు, ఉడతా వేణుగోపాల్‌రావు, తొండెపు మణి, కొదుమూరి కోటేశ్వరరావు, పెండేల ప్రసాదరావు, పెండేల కృష్ణమూర్తి, లక్ష్మీదేవిపల్లిలో కూరా శ్రీధర్, తెల్లాకుల డైమండ్‌రావు, వేమిశెట్టి శ్రీనివాస్, వెచ్చ శ్రీరాములు, చారుగుండ్ల నాగేశ్వరరావు, క్రాంతికుమార్, అన్నపురెడ్డిపల్లిలో వనమా గాంధీ, వనమా శ్రీను, ప్రదీప్, ప్రవీణ్, పుల్లారావు, ఇల్లెందులో ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, చంద్రశేఖర్, కండె రమేష్, తాటిపల్లి సుబ్బారావు, భద్రాచలంలో జిల్లా ఆర్య వైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి వినతి

అశ్వారావుపేట, జూలై 4: మండలంలోని గుమ్మడవల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ఎంఈవోకు వినతిపత్రం ఇచ్చారు. మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులకుగాను ఇద్దరు మాత్రమే ఉన్నారని చెప్పారు. పుట్టా సత్యం, సాయిల గోపాలరావు, వీరబాబు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ నిర్ణయం పట్ల హర్షం

భద్రాచలం, జూలై 4: ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలనే ప్రజల కోరికను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించి, సముచిత నిర్ణయం తీసుకోవాలని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా తెలపడం పట్ల హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయవాది పిట్లా శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాద బీమాపై అవగాహన

ఇల్లెందు రూరల్, జూలై 4: ప్రమాద బీమాపై సింగరేణి ఇల్లెందు ఏరియా కాంట్రాక్ట్ కార్మికులకు జీఎం జాన్ ఆనంద్ గురువారం తన కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఎస్‌వో టు జీఎం మల్లయ్య, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కార్తిక్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, అధికారులు ధనుంజయ్‌రెడ్డి, మహేష్, సాయి స్వరూ ప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల గుర్తింపు

పినపాక , జూలై 4: ప్రభుత్వ భూములను గుర్తించేందుకు మండలంలోని పినపాక, గడ్డంపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో తహసీల్దార్ సూర్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది కలిసి గురువారం పర్యటించారు. పినపాక రెవెన్యూ తోగ్గూడెం పంచాయతీ గోపాలరావు పేట గ్రామ పరిధిలో 128 సర్వే నంబర్‌లో 127 ఎకరాలను గుర్తించారు. గడ్డంపల్లి రెవెన్యూలో కూడా కొన్ని ప్రభుత్వ భూములను గుర్తించారు. మండల సర్వేయర్ నరేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసుగుతో వచ్చింది.. కత్తితో పొడిచింది

చుంచుపల్లి, జూలై 4: ముసుగు ధరించిన ఓ మహిళ.. మరో మహిళపై కత్తితో దాడి చేసింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మండలంలోని రుద్రంపూర్ పంచాయతీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని శిరీష నివాసం ఉంటున్నది. ఆమె ఇంటికి గురువారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో కొత్తగూడెం ఎదురుగడ్డకు చెందిన పావని వచ్చింది. ఆమె అప్పటికే తన ముఖానికి స్కార్ఫ్ ధరించి ఉంది. ఆమె శిరీష ఇంట్లోకి చొరబడింది. శిరీషపై కత్తితో పొడిచింది. ఈ దారుణాన్ని చూసిన శిరీష పిల్లలు భయంతో బయటకు పరుగెత్తి కేకలు వేశారు. చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చారు. వారిపై కూడా దాడి చేసేందుకు పావని యత్నించింది. వారు తెగించి అడ్డుకోవడంతో, ఆమె తన చేతిలోని కత్తిని అక్కడే పడేసి తప్పించుకుని పారిపోయింది. రక్తపు మడుగులో పడిపోయిన శిరీషను వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అందిన సమాచారంతో అక్కడకు టూ టౌన్ పోలీసులు చేరుకున్నారు. వివరాలు సేకరించారు. శిరీష తలపై, మెడపై 54 కుట్లు పడినట్లు వైద్యులు తెలిపారు. ఈ దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి

అశ్వారావుపేట, జూలై 4: ఇంటిపై నుంచి పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎస్‌కె.షరీఫ్(53) వెల్డింగ్ వృత్తిదారుడు. ఏడాది క్రితం అశ్వారావుపేట వచ్చి స్థిరపడ్డాడు. మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామంలో బుధవారం ఓ ఇంటిపై రేకులకు వెల్డింగ్ చేస్తూ జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలయ్యాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ఆసుపత్రిలో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇతడి భార్య ఫాతిమా ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై శివరామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు క్వింటాళ్ల బెల్లం పట్టివేత

కరకగూడెం, జూలై 4: అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల బెల్లాన్ని పోలీసులు గురువారం స్వాధీనపర్చుకున్నారు. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాలు... బెల్లం తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు గురువారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ములుగు జిల్లా మేడారం నుంచి ఐదు క్వింటాళ్ల బెల్లాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను మండలంలో తాటిగూడెంలో గుర్తించారు. దానిని స్వాధీనపర్చుకున్నారు. బెల్లం తరలిస్తున్న పినపాక మండ లం గోవిందరావుపేటకు చెందిన వ్యాపారి కొటెం దుర్గయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆటోను సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చర్ల, జూలై 4: మండలంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మామిడి కృష్ణ (37) గురువారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.26.45 లక్షలకు సంత వేలం

బూర్గంపాడు, జూలై 4: మండలంలోని మోరంపల్లిబంజర సంత వేలం పాట పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగింది. రూ.26.45 లక్షలకు అశ్వారావుపేటకు చెందిన తేజావత్ కోటేశ్వరరావు దక్కించుకున్నారు. పంచాయతీ ప్రత్యేకాధికారి/ఎంపీడీవో జములారెడ్డి అధ్యక్షతన డీఎల్‌పీవో సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీవో సునీల్‌శర్మ, పంచాయతీ కార్యదర్శులు భవాని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

టేకులపల్లి, జూలై 4: మండలంలోని రాంపురం పంచాయతీ కార్యదర్శి బి.సందీప్ విధులకు సకాలంలో హాజరవడం లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు బర్మావత్ శివకృష్ణ గురువారం ఎంపీడీవో రవీందర్‌రావుకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, జూలై 4: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం రెండోవ విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఆశ్రమ పారిశ్రామిక శిక్షణ సంస్థ కృష్ణసాగర్ ప్రిన్సిపల్ బీ లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలని, పదోవ తరగతి ఉత్తీర్ణులై, 01-08-2024నాటికి 14 ఏళ్లు నిండి వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

సహకార సంఘం డైరెక్టర్ ఎన్నిక

జూలూరుపాడు, జూలై 4: స్థానిక సహకార సంఘం 9వ వార్డు డైరెక్టర్‌గా వెంగన్నపాలెం గ్రామస్తుడు శిరంశెట్టి రామారావును గురువారం జరిగిన కార్యవర్గ సమావేశం ఎన్నుకుంది. సంఘం అధ్యక్షుడు చీమలపాటి భిక్షం, సీఈవో రమణారెడ్డి, డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, కొమ్మినేని పాండురంగారావు, చేపలమడుగు రాంమూర్తి, హేమ్లా తదితరులు పాల్గొన్నారు.

అనంతారంలో వైద్య శిబిరం

జూలూరుపాడు, జూలై 4: మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఎంపీవో తోట తులసీరాం, వైద్య సిబ్బంది సావిత్రి, కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ముత్యాలరావు

దుమ్ముగూడెం, జూలై 4: ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ముత్యాల రావుకు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గురువారం విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన ముత్యాలరావుకు కార్యాలయం సిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు.